క్లుప్తంగా

24న మండల సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24న ఎంపీపీ అరుణ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ముమ్మర ప్రచారం


- చారకొండ మండలంలోని జూపల్లిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాలేమియా ఇంటింటికి వెళ్లి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు.
- పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం సర్పంచ్ నాగరాజుతో పాటు పలువురు కొల్లాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా కోడేరుతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు.
- అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లిలో బీజేపీ అచ్చంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దేవని సతీష్‌మాదిగకు మద్దతుగా ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గోలి రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- తిమ్మాజీపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు.
- వెల్దండ మండల కేంద్రంలో నిర్వహించిన ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, ఎంపీటీసీలు, సర్పంచ్ ఉన్నారు.
- బిజినేపల్లిలో నిర్వహించిన రేవంత్‌రెడ్డి విజయభేరీ సభకు బిజినేపల్లి, తాడూరు మండల కేంద్రాలతో పాటు మన్ననూరు నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

మానవత్వాన్ని చాటిన విద్యార్థులు



అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు మానవత్వం చాటారు. ప్రస్తుత శీతాకాలంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో అనాథ వృద్ధులకు చలికి ఇబ్బందులు పడుతుండటంతో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు ఇచ్చిన ప్యాకెట్ మనీని జమ చేసి పాఠశాల యాజమాన్యం సహకారంతో దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు అందించారు. అనంతరం పలువురు విద్యార్థులను అభినందించారు.

బీటీ రోడ్డు లేక అవస్థలు



తాడూరు: మండల కేంద్రం నుంచి కోనుంపు మీదుగా ఇంద్రకల్, జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు బీటీకి నోచుకోక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలు కాలేదని వాపోయారు. వర్షాకాలంలో మట్టిరోడ్డుతో నానా అవస్థలు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం మూడు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి బీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం జిల్లా నాయకులు సెంది శేఖర్, కొల్లాపూర్ సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌ల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ లోకి మార్చేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా సంఘం అభివృద్ధికి అందరూ కలిసి రావాలని కోరారు.

వీపనగండ్ల: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నించాలని జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ మేకల సురేంద్రబాబు, రాష్ట్ర సంఘం నాయకులు బొలమోని ధర్గేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ మత్స్యకారులు దినోత్సవాన్ని పురస్కరించుకొని గోవర్ధనగిరిలో మత్స్యకారుల జెండాను ఎగరవేశారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



అనంతసాగర్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి: నియోజక వర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గట్టునెల్లికుదురు, గట్టురావిపాకుల, గడ్డంపల్లి గ్రామాలతోపాటు పెద్దపల్లి, అనంతసాగర్ గ్రామాల్లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగం జనార్దన్‌రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు ప్రగతిపథంలో దూసుకుపోతున్నాయన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, బీటీరోడ్లు, ప్రభుత్వ పథకాలు భగీరథ, మిషన్ కాకతీయ ద్వార సాగు, తాగునీరు అందించామన్నారు. రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సొంత ఖర్చులతో సామూహిక వివాహాలు, రూ.5 లకే భోజనం, యువతకు ఉచిత లైసెన్స్ ఇచ్చానని గుర్తు చేశారు. మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గెలిచిన వెంటనే రూ.400లకే గ్యాస్ సిలిండర్, రైతుబంధు పెంపు, ఆసరా పింఛన్ల పెంపు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడ్డారని గుర్తుచేశారు. అంతకుముందు వారికి గ్రామాలలో మహిళలు, కార్యకర్తలు బోనాలతో స్వాగతం పలికారు. కాంగ్రెస్ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ కొమ్ము మధు, మండల అధ్యక్షుడు ఈదుల నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ జిల్లా చైర్మన్ హనుమంతురావు, విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు దిష్టి తీస్తున్న మహిళలు



ఎమ్మెల్యేకు స్వాగతం పలికేందుకు వస్తున్న మహిళలు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో ఒరిగిందేమీలేదు



కొల్లాపూర్‌లో బీజేపీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు



రేకులపల్లి తండాలో ప్రచారం చేస్తున్న ఎల్లేని కూతురు తేజశ్రీ

కొల్లాపూర్/కోడేరు: ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జూపల్లి కృష్ణారావు, ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం బెక్కెం, నాగర్లబండ తండాకు చెందిన పలువురు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎల్లేని సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ మంత్రి జూపల్లి ఏ మోహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కొల్లాపూర్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేష్‌నాయక్, రవినాయక్, శంకర్, వెంకటేష్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ గంగామోహన్ పరిశీలించారు. మండలంలోని పాపగల్, ఇంద్రకల్, శిర్సవాడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో వసతులతోపాటు ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఉండాలని బీఎల్‌ఓలను కోరారు. తాగునీరు, విద్యుత్, తదితర వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో ఓటింగ్ ప్రక్రియ పరిశీలన



సింగోటంలో వృద్ధురాలుతో ఓటింగ్ వేసే విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పోలీసులకు పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి

కొల్లాపూర్/కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో ఇంటి వద్ద నుంచి ఓటింగ్ వేసే విధానాన్ని నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు సురేష్ కుమార్ క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 70 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఇంటివద్దనే వినియోగించుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరిలో 59 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఒక గ్రామానికి ఎంపిక చేశామన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: శాసనసభ ఎన్నికలలో భాగంగా ఫామ్ డి12 ద్వారా 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 99 మంది ఓటు హక్కును ఇంటివద్దనే వినియోగించుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. రెండు రోజులపాటు అధికారులు వారి ఇండ్ల వద్దకు వెళ్లి ఎన్నికల సిబ్బంది ఓట్లను వేయించారు. 99 ఓట్లకుగాను 91 మంది ఓటు వేశారని పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల విధులకు వెళ్లే పోలీసు సిబ్బంది, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్ పోస్టల్ బ్యాలెట్‌లను అందజేశారు.

మాదాసి కురువల వ్యతిరేకి జూపల్లి

కొల్లాపూర్: మాదాసి, మాదారి కురువల వ్యతిరేకి మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు అని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భీరయ్య అన్నారు. మంగళవార పట్టణంలో మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా భీరయ్య మాట్లాడుతూ అప్పట్లో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని ఆదేశిస్తే ఆ ఉత్తర్వులను అమలు కాకుండా జూపల్లి కృష్ణారావు అడ్డుకున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు జీఓ అమలు అయ్యేందుకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ధర్మయ్య, ఈదన్న, మల్లయ్య, రాంబాబు, గోపాల శేషయ్య, రాము, సూరి, కురుమయ్య, చందు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష



ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పలు పార్టీల నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రూ.400 వంటగ్యాస్ సిలిండర్, రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ, పేదలు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జీఎం నజీర్, చిక్కేపల్లికి చెందిన తెల్లు శ్రీను, తెల్లు బాలస్వామి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రంగినేని అభిలాష్‌రావు, సుధాకర్‌యాదవ్, చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్ పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని పస్పులకు చెందిన స్వామి, రంగస్వామి, చంద్రయ్య, వార్డు సభ్యుడు కృష్ణయ్యతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లిలో బీరం విజయమ్మ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, నర్సింహ, బిచ్చిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు భూంరెడ్డి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్‌లో ఎమ్మెల్యేగా మరోసారి హర్షవర్ధన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాంభూపాల్‌రెడ్డి, రాజేష్, శేషేంద్రప్రసాద్, మతీన్, కుమార్‌లు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీరం విజయమ్మ



పాన్‌గల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం



కసిరెడ్డికి మద్దతుగా తోటపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని తోటపల్లి సర్పంచ్ రాజేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హనుమంతురెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా తోటపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. గడపగడపకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. కల్వకుర్తి మండలంలో పంటల పొలాలకు సాగునీరు అందేలా కసిరెడ్డి నారాయణరెడ్డి ఎంతో కృషి చేశారని ప్రజలకు వివరించారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. రైతులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు అధికం అయ్యాయని పేర్కొన్నారు. దొరలపాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పట్టణంలోని ఇందిరానగర్ 20వ వార్డులో ఆదర్శ యువజన సంఘం, మందులు సంఘం సభ్యులు కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని 18వ వార్డులో కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి వెళ్లి ఆరు గ్యారంటీల పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షాకీర్, వర్కల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

కాంగ్రెస్ హయాంలోనే కల్వకుర్తి ఎత్తిపోతలు



మాట్లాడుతున్న జగన్నాథం

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ హయాంలోనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సాధ్యమైందని మాజీ ఎంపీ జగన్నాథం అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న సమయంలో దివంగత ముఖ్యమంత్రి డా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో పథకానికి నిధులు మంజూరు చేయించడంతోపాటు కాల్వల నిర్మాణ పనులు చేయించానని గుర్తు చేశారు. 70 శాతం పనులు కాంగ్రెస్ హయాంలో జరిగాయన్నారు. నిరంతరం రైతులు ప్రజల సంక్షేమం కోసం కసిరెడ్డినారాయణరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. అధికార పార్టీ అసత్యప్రచారాలు ప్రజలు నమ్మొద్దన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సాయి వ్రతాలు



సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

కందనూలు: భగవాన్ సత్య సాయిబాబా 98వ జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని షిరిడిసాయి దేవాలయంలో సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ హాకీం విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ లోక కల్యాణార్థమై వ్రతాలు నిర్వహించామన్నారు. బుధవారం సాయిబాబా వారి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమం పట్టణ ప్రధాన, పురవీధుల గుండా భక్తిగీతాలు ఆలపిస్తూ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. గురువారం సత్యసాయి బాబా జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అన్నప్రసాదం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వావిలాల రాజశేఖర్ శర్మ, భజన మండలి సభ్యులు, సాయి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాభవాని ఉత్సవాలు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గిరిజనుల ఆరాధ్య దైవం తుల్జాభవాని (పోషమ్మ) దేవత ఉత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. తండాలోని గిరిజనులంతా ప్రతి ఇంటి వద్ద ప్రత్యేకంగా బట్టతో తయారు చేసిన మండపంలో అమ్మవారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధాన్యం బస్తాలు, పలు రకాల పూలతో అమ్మవారిని అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అధికసంఖ్యలో దర్శించుకున్నారు. తండాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు, సౌండ్‌బాక్సులు, గిరిజనుల నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది. తుల్జాభవానీ దేవతతో తండాలో గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. ఈ పండుగ మూడు రోజుల పాటు నిర్వహిస్తారని గిరిజనులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు బాల్యానాయక్, బాబునాయక్, గోపాల్‌నాయక్, రాజునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి సహకరించాలి



కల్వరాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాన్‌గల్: ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలకు వచ్చే పోలింగ్ సిబ్బందికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ తమ తోడ్పాటునందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, భోజన వసతి వంటి వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కార్యదర్శులు చూసుకోవాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని, అన్ని జీపీలల్లోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు కొత్తపేటలోని నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను ఆయన పరిశీలించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

వీపనగండ్ల: దివ్యాంగులు సీనియర్ సిటిజన్ వినియోగించుకోనున్న పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులు మంగళవారం గోపల్‌దిన్నె, కల్వరాల, సంగినేనిపల్లి, వీపనగండ్ల, బొల్లారం తదితర గ్రామాల్లో అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం ఉమ్మడి చిన్నంబావి, వీపనగండ్ల, పాన్‌గల్ మండలాల్లో ఎన్నికల ప్రత్యేక అధికారి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. వీపనగండ్ల మండలంలో 18 మంది, చిన్నంబావిలో 12 మంది, పాన్‌గల్‌లో ముగ్గురు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మైక్రోఅబ్జర్వర్ ప్రవీణ్, పంచాయతీ సెక్రెటరీ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.